క్లుప్తంగా

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలోని అతి పురాతనమైన మరకతలింగ సహిత రుక్మిణీపాండురంగ విఠలేశ్వర ఆలయంలో మంగళవారం నుంచి కార్తీకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు హరి రంజన్‌శర్మ, రఘుశర్మ పేర్కొన్నారు. ఉదయం నుంచే పుణ్యాహవచనం, అఖండదీపస్థాపన, విఘ్నేశ్వరపూజ, స్వస్తివాచనం, రుక్మిణీ పాండురంగస్వామికి అష్టోత్తర శతపురుషసూక్త, శ్రీసూక్త అభిషేకం, మరకత లింగానికి రుద్రాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమర్థంగా పనిచేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధ్యాయులు ఒత్తిడి లేకుండా, సమర్థవంతంగా పని చేసి మండలాన్ని మొదటి స్థానంలో ఉంచాలని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఏఎస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) ప్రాముఖ్యత, ప్రశ్నాపత్రం విశ్లేషణ, మూల్యాంకనం గురించి వివరించారు. ఉపాధ్యాయుల సమయపాలన, ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల సమావేశం, విద్యార్థుల హాజరు శాతం పెంచేలా తగిన సూచలను ఇచ్చామన్నారు. వచ్చే నెలలో జరిగే ఎన్‌ఏఎస్‌లో మండలం ఉత్తమ స్థాయిలో ఉండాలని చెప్పారు.

మండల విద్యాధికారిగా లీలావతి

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండల విద్యాధికారిగా సోమవారం లీలావతి బాధ్యతలు స్వీకరించారు. మండలంలో గెజిటెడ్ హెచ్‌ఎం లేకపోవడంతో చేగుంట మండలం వడియారం ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను జిల్లా అధికారులు నియమించారు. నూతన ఎంఈఓను కాంప్లెక్స్ హెచ్‌ఎం ధర్మపురి, హెచ్‌ఎంలతో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు రంగారెడ్డి, భద్రయ్య, యూనీస్, శేఖ్‌భాష, స్వప్నశ్రీ, రాజేశ్వర్‌రావు, భాగ్యలక్ష్మి తదితరులు కలిసి సన్మానించారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ నారాయణ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ నారాయణ ప్రారంభించగా, ఆయుష్మాన్ బ్లడ్‌బ్యాంకు నిర్వాహకులు రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మండలాధ్యక్షుడు నాగరాజు కార్యదర్శి రాంచంద్రం, కోషాధికారి సతీష్ బాబులాల్, వీరబ్రహ్మం, అనీల్‌కుమార్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నర్సింలు, నాగరాజు, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని అల్లాదుర్గం ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మలత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మెనూను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు.

మంచి ఫలితాలు సాధించాలి

మనోహరాబాద్(తూప్రాన్): పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను అన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని ఎంఈఓ మల్లేశం సూచించారు. ఈ మేరకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ఎంఈఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి అర్థమయ్యేరీతిలో, వారు ఆకళింపు చేసుకునేలా నాణ్యమైన బోధన అందించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. విధిగా గ్రంథాలయ పీరియడ్ ఏర్పాటు చేసి, అందరు విద్యార్థులు నచ్చిన పుస్తకాలను చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు.

పాఠశాల వివరాల నమోదు చేయాలి: ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): పిల్లలు, ఉపాధ్యాయులు వివరాలను యూడైస్‌లో నమోదు చేయాలని ఎంఈఓ బాలరాజు తెలిపారు. సోమవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో మండల హెచ్‌ఎంలో యూడైస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో పిల్లలు, ఉపాధ్యాయుల వివరాలు, పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతులు ఇతర వివరాలు నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం వివరాలతో పాటు ఎస్‌ఎంసీ వివరాలు నమోదు చేయాలన్నారు. విద్యార్థులు నాణ్యమైన విద్యను అందించాలని చెప్పారు. వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పింఛన్ రావడంలేదని రాయండి

- ఎన్యుమరేటర్లను అడుగుతున్న గ్రామస్తులు
- ఆస్తుల వివరాలు చేప్పేందుకు నిరాకరణ



కౌడిపల్లి(నర్సాపూర్): ధర్మాసాగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ మహిపాల్

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా సోమవారం ఎన్యుమరేటర్లు సమగ్ర ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఇదే సమయంలో పలువురు కుటుంబసభ్యులు తమకు ప్రభుత్వం ఇస్తామన్న పింఛన్ రావడంలేదని, ఫించన్ ఇప్పించాలని సర్వే ఫారంలో రాయలంటూ ఎన్యుమరేటర్లను పట్టుబడుతున్నారు. పలువురు వ్యక్తిగత ఆస్తుల వివరాలు చేప్పేందుకు నిరాకరిస్తున్నారు.

పకడ్బందీగా సర్వే

నర్సాపూర్ రూరల్: కులగణన సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు సర్వే సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని రెడ్డిపల్లి, పెద్ద చింతకుంటలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించి సర్వే పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలు సైతం సర్వే సమయంలో అందుబాటులో ఉండి తమ వివరాలు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధులత సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేయండి

అల్లాదుర్గం(మెదక్): ఎలాంటి తప్పులు లేకుండా కులగణన సర్వేను చేపట్టాలని మండల ప్రత్యేక అధికారిణి కరుణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గడిపెద్దాపూర్, ముస్లాపూర్, అల్లాదుర్గంలో సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

పక్కగా చేయాలి

కౌడిపల్లి(నర్సాపూర్): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పక్కగా చేయాలని నర్సాపూర్ ఆర్‌డీఓ మహిపాల్ సూచించారు. సోమవారం మండలంలోని ధర్మాసాగర్‌లో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల, ఆర్‌ఐ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి నరహరి, ఏఎస్‌ఓ నర్సింలు పాల్గొన్నారు.



నర్సాపూర్ రూరల్: సర్వేను పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

సర్వే పరిశీలన

మండలంలోని ధర్మాసాగర్‌గేట్ వద్ద సోమవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నర్సాపూర్ డీఎల్‌పీఓ సాయిబాబా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల, పంచాయతీ కార్యదర్శి నరహరి, ఏపీఏ పుణ్యదాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిముక్లలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఇంటింటి సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. పలు గ్రామాల్లో సర్వేను తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీఓ నాగేశ్వర్ గుప్తా, ఎంపీఓ తిరుపతిరెడ్డి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

ముమ్మరంగా కుల గణన సర్వే

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ, రాంపూర్, బచ్చురాజ్‌పల్లి, జెడ్ చెరువు తండా గ్రామాల్లో సోమవారం కుల గణన సర్వేను మండల ప్రత్యేకాధికారి గోవింద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల గణన సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజిరెడ్డి, ఎంపీఓ ప్రవీణ్, కార్యదర్శులు నర్సింహరెడ్డి, ఎన్యుమలేటర్లు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

కొల్చారం(నర్సాపూర్): దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దని ఆర్డీఓ మహిపాల్ సూచించారు. మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి, రాంపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆర్డీఓ పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులను కోరారు. కొనుగోలు కేంద్రాలో మద్దతు ధర లభిస్తుందన్నారు. ధాన్యం తరలింపులో, తూకంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు, జిల్లా పాలనాధికారి ఆదేశాలతో కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని, పూర్తి స్థాయిలో కొనుగోళ్లు జరిగేలా కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గఫర్‌మియా, ఆర్‌ఐ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపండి

టేక్మాల్(మెదక్): కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాలకు వెంటనే లారీలను పంపాలని నవ్యభరతి యువజన సంఘం అధ్యక్షుడు భాస్కర్ సోమవారం అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఐకేపీ, కోఆపరేటివ్ వరి కొనుగోలు కేంద్రాల్లో తూకం చేసిన ధాన్యం బస్తాలు కుప్పలుగా ఉన్నాయని తెలిపారు. వరి కొనుగోలు సెంటర్లు ప్రారంభించి 20 రోజులు అయినా.. సరిగ్గా లారీలు రావట్లేవని, దీంతో రైతులు అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. తగు చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు.



మెదక్‌లో పీడీకి వినతిపత్రం అందిస్తున్న భాస్కర్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం అభినందనీయమని ఎంఈఓ యాదగిరి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి అన్నారు. ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడల్లో పాల్గొనడానికి జిల్లా నుంచి అర్హత సాధించిన మండలంలోని మానెపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని నందినిని సోమవారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం తరపున రూ. 5వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లా టీంకు ఎంపికైన శివనీల, నందినిలను శాలువాతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సీతారాం, హెచ్‌ఎం కౌసల్య, వ్యాయామ ఉపాధ్యాయుడు సంతోష్, ఏఏపీసీ చైర్మన్ వసంత, పంచాయతీ కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఆమోస్, ఆజామ్, పీనా, శ్రీనివాస్, సరళ తదితరులు పాల్గొన్నారు.

లారీల కొరతతో నిలిచిన ధాన్యం



బండపోతుగల్‌లో నిలిచిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

- పట్టించుకోని అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతు ధాన్యం పండించడానికి పడే కష్టం కంటే, దానిని విక్రయించేందుకే ఎక్కువ కష్టపడుతున్నాడు. మండలంలోని బండపోతుగల్ గ్రామంలో ధాన్యం తూకం వేసి నాలుగు రోజులు గడుస్తున్నా.. లారీలు లేకపోవడంతో ఎక్కడి ధాన్యం బస్తాలు అక్కడే ఉన్నాయి. దీంతో ఆవేశానికి గురైన రైతులు సొసైటీ సీఈఓ పోచయ్య అక్కడికి రావడంతో అతడిని అడ్డుకొని నిరసన తెలిపారు. త్వరగా ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా రైతు సమన్వయ సభ్యుడు సయ్యద్‌హుస్సేన్ మాట్లాడుతూ.. గ్రామ రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అదనపు కలెక్టర్‌కు లారీల సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశామన్నారు. అదేవిధంగా మిల్లులకు తరలించిన లారీలు త్వరగా ఖాళీ చేయించి, ధాన్యం కేంద్రాలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు నర్సింహరెడ్డి, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

'వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి'

శివ్వంపేట(నర్సాపూర్): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిపై కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని జెడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కొల్చారంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రైతుల ఇబ్బందులు ప్రభుత్వం తీర్చాలనే సంకల్పంతో రైతుదీక్ష చేస్తే కాంగ్రెస్ నాయకులకు అక్కసు ఎందుకన్నారు.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుబడుతున్న ఎమ్మెల్యేపై రాజకీయ దురుద్దేశంతో కావాలనే విమర్శలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే నియోజక అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపై వడ్లకుప్పలతో టీఏకు గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రధాన రోడ్డుపై వడ్ల కుప్పలను ఏర్పాటు చేయడంతో ఈజీఎస్ టెక్నికల్ ఇంజనీర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. శివ్వంపేట ఎంపీడీఓ కార్యాలయంలో టీఏగా పని చేస్తున్న సురేందర్ సోమవారం విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వస్తుండగా జీడిపల్లి- చిన్నగొట్టిముక్ల ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ధాన్యం కల్లాలతో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని హైదరాబాదులోని ఓ ఆస్పత్రికి తరలించారు. చిన్నగొట్టిముక్ల నుంచి సికింద్లాపూర్ వరకు రోడ్డుపై ధాన్యం రాశులు ఉంచడం వల్ల వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నా.. సంబంధిత పోలీస్‌శాఖ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఉచిత వైకుంఠ రథం సేవలు ప్రారంభం

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ సోమవారం ఉచిత వైకుంఠ రథాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీ నిధుల నుంచి దీనిని కొనుగోలు చేశామని, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు నాగరాజు, యాదగిరి, రాధాభవాని, అనిల్‌కుమార్, సుందర్‌సింగ్, మల్యాల కవిత, నాయకులు కొండల్‌రెడ్డి, యాదగిరి, బాలు, పాల్గొన్నారు.

గంజాయి వినియోగిస్తున్న వారికి కౌన్సెలింగ్

తూప్రాన్: గంజాయి వినియోగిస్తున్న యువకులు, వారి తల్లిదండ్రులకు పోలీసులు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్‌లో గంజాయి వినియోగించడంతో పాటు విక్రయిస్తున్న ముఠా సభ్యులను విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఆదివారం గంజాయితో పాటు కొందరు యువకులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మండలంతో పాటు శివ్వంపేట, వెల్దుర్తి, చేగుంట, నర్సాపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లోని యువకులు గంజాయి వినియోగిస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలినట్లు సమాచారం. అయితే గంజాయి మహారాష్ట్రకు చెందిన కొందరు వ్యక్తులు కొంత కాలంగా తీసుకొచ్చి ఈ ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు తెలినట్లు తెలిసింది. ఇందుకు కారకులైన వారి వివరాలతో పాటు వినియోగిస్తున్న వారి పూర్తి వివరాల సేకరణలో పోలీసులు నిమగ్నమయ్యారు. అయితే సుమారు 200 మంది యువకులు గంజాయి బాధితులు ఉన్నట్లు, పూర్తి వివరాలు మూడు రోజుల్లో వెల్లడించనున్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ ఉన్నత పాఠశాలలో 2000–21 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం మండల పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయంగా కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారికి పాఠాలు బోధించిన గురువులు రాంచంద్రారెడ్డి, వెంకటరాజయ్య, నరేందర్‌లను ఆహ్వానించి, వారిని ఘనంగా సన్మానించారు. 23 ఏళ్ల తర్వాత ఇలా కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్‌గౌడ్, మొగులయ్య, దత్తు, గణేశ్, హరికృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి



నర్సాపూర్: శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్లలో దీపోత్సవం

నర్సాపూర్: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శివాలయంలో భక్తులు సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించి, శివుడికి పూజలు చేశారు.

ఉమాసంగమేశ్వర దేవాలయంలో..

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. కార్తీక సోమవారం కావడంతో పెద్దశంకరంపేటతో పాటు మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో దీపాలు వెలగించి మొక్కులు చెల్లించుకున్నారు.

శివ్వంపేటలో లక్ష దీపార్చన

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి లక్ష దీపార్చన మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ ఆధ్వర్యంలో కార్తీకమాసం పురస్కరించుకొని మహాశివుడికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష దీపార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త స్వరూప రమేశ్‌గుప్తా, రమాదేవి తిరుపతిరెడ్డి దంపతులు, గ్రామస్తులు కృష్ణాగౌడ్, గోవింద్‌రాజుగుప్తా, పోచగౌడ్, వెంకటేష్, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

'నూజివీడు సంధ్య'తో అధిక దిగుబడి

- నేషనల్ సేల్స్ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి



మాట్లాడుతున్న సేల్స్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): నూజివీడు ఎన్పీ 9359–9 సంధ్య సన్నరకం వడ్లు అధిక దిగుబడి ఇస్తాయని ఆ సంస్థ నేషనల్ సేల్స్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అబ్లాపూర్‌లో మెగా ఫీల్డ్ విజిట్‌లో ఆయన మాట్లాడుతూ.. తక్కువ ఖర్చులో అధిక దిగుబడిలు ఇచ్చేలా ఎన్పీ9359–9 సన్నరకం వరి విత్తనాలు తయారు చేశామన్నారు. ఈ రకం వరిలో గింజలు గట్టిగా రూపొందుతాయని, 130 నుంచి 135 రోజుల్లో పంట చేతికొస్తుందని చెప్పారు. తెగుళ్లు ఎదుర్కొని అధిక దిగుబడులు ఇస్తుందన్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులు తక్కువ మోతాదులో అవసరమవుతాయని చెప్పారు. దిగుబడి 20 శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కిన్నెర కళాకారుడు పద్మశ్రీ మొగులయ్య పాట పాడి రైతులను అలరించారు. వివిధ గ్రామాల రైతులు, డీలర్ ఏడుకొండలు, సంస్థ ప్రతినిధులు రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ స్కౌట్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ



పాపన్నపేట(మెదక్): హైదరాబాద్‌లో ఈ నెల 10న నిర్వహించిన స్కౌట్ స్టేట్ ఎగ్జిబిషన్‌లో మెదక్ జిల్లాకు చెందిన 10 మంది విద్యార్థులు ప్రతిభ చాటారని జిల్లా కార్యదర్శి రాజేందర్ తెలిపారు. క్యాంప్ క్రాఫ్ట్, ఎగ్జిబిషన్, కల్చరల్ ఆక్టివిటీస్‌లో ఏ–గ్రేడ్ అవార్డు పొందినట్లు చెప్పారు. యూసుఫ్‌పేట, రామాయంపేట కేజీబీవీ విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు.

◆ భూ సమస్యలు పరిష్కరిస్తాం

చిన్నశంకరంపేట(మెదక్): ధరణి భూ సమస్యలపై ప్రజావాణిలో అందించిన దరఖాస్తులను పరిష్కరిస్తామని నార్సింగి తహసల్దార్ షేక్ కరీం అన్నారు. సోమవారం నార్సింగి తహసీల్దార్ కార్యాలయంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తహసీల్దార్ పరిధిలోని సమస్యలను ఇక్కడే పరిష్కరిస్తామన్నారు. మండలంలోని రైతులు ఎలాంటి భూ సమస్యనైన ప్రజావాణిలో దరఖాస్తు చేయాలన్నారు.

◆ సీసీరోడ్డు పనులు ప్రారంభం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిటుకుల్‌లోని పలు కాలనీలో సోమవారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి పీఆర్‌ఏఈ ఏఈ మారుతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి తిరపతి, నాయకులు భూమయ్య, వెంకట్‌రెడ్డి, అకిల్ తదితరులు పాల్గొన్నారు.

◆ మంచినీటిలో పురుగులు



కౌడిపల్లి(నర్సాపూర్): రక్షిత మంచినీటి పథకం నల్లానీటిలో పురుగులు వస్తున్నాయి. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాజిపేటలో సోమవారం నల్లాల ద్వారా సరఫరా అయిన మంచినీటిని గ్రామస్తులు పట్టుకోగా అందులో జెనిగలు, వానపాములు, ఇతర పురుగులు వచ్చినట్లు మహిళలు తెలిపారు. ప్రతి నెలలో నీటి ట్యాంక్‌లను మూడు సార్లు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాల్సి ఉండగా అధికారులు పట్టించు కోవడంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనీటిని తాగితే ఆరోగ్యం ఏమవుతుందని ప్రశ్నించారు.

◆ ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

తూప్రాన్: మున్సిపాలిటీలోని 16వ వార్డులో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. విస్తరణ పనులు మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, 16వ వార్ కౌన్సిలర్ నారాయణగుప్తా ఆధ్వర్యంలో రోడ్డు విస్తారణ చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీశైలంగౌడ్, నాయకులు నాగులు తదితరులు పాల్గొన్నారు.

◆ ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చేయొద్దు

హవేళీఘణాపూర్(మెదక్): వరిధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని, సమన్వయంతో పని చేసి సకాలంలో ధాన్యం తరలించేలా చూడాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కప్రాయిపల్లి గ్రామంలో నిర్వహించిన సేవాలాశ్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సేవాలాశ్ దేవాలయంలో పూజలు నిర్వహించారద్దీ సందర్భంగా రైతులు తమ వరి ధాన్యం తరలింపులో ఆలస్యమవుతుందని హన్మంతరావు దృష్టికి తీసుకెళ్లగా.. జేసీ నగేశ్‌తో ఆయన మాట్లాడారు. ధాన్యం తరలింపులో ఆలస్యం చేయకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు శ్రీనివాస్, పరశురామ్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీకాంత్, నాగిరెడ్డి, రాంచంద్రరావు,రాజు, గోపాల్, రాజు పాల్గొన్నారు.

◆ కలెక్టర్‌పై దాడి హేయమైన చర్య

మనోహరాబాద్(తూప్రాన్): వికారాబాద్ కలెక్టర్ మీద జరిగిన దాడిని ఖండిస్తున్నామని జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం ఉపాధ్యక్షుడు రాజు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా.. వాటిని పరిష్కరించుకునే మార్గం ఉందని, చట్టాన్ని తమ చేతిలోకి తీసుకొని అధికారులపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు.